క్లుప్తంగా

పదో తరగతి పరీక్షలకు 17 మంది గైర్హాజరు

కిర్లంపూడి: మండలంలోని కిర్లంపూడి, బూరుగుపూడి, తామరాడ, జగపతినగరంలో ఏర్పాటు చేసిన ఐదు పరీక్ష కేంద్రాల్లో పదో తగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. కాగా బుధవారం జరిగిన పరీక్షలకు ఈ ఐదు కేంద్రాల్లో 1003 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 986 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్టు ఎంఈవో టి.జోసెఫ్ తెలిపారు. 17 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్టు వివరించారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు



చిన్నారితో వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపిస్టు సోమేశ్వరరావు

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఫిజియోథెరపిస్టు టీఎన్ఎస్ సోమేశ్వరరావు చిన్నారులతో వ్యాయామాలు చేయించారు. చిన్నారుల ఆరోగ్యం, రోజూ చేయించాల్సిన వ్యాయామాల పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ శ్రీనివాస్ పరిశీలించారు. ఐఈఆర్పీలు నాగగోవిందు, నారాయణరావు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఏలేశ్వరం: గ్రామస్థాయి నుంచే పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గంటా బాలుదొర సూచించారు. పట్టణంలో బుధవారం ఆయన బూత్‌స్థాయి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించాలన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గట్టిం వెంకటరమణ, మండల శాఖ అధ్యక్షుడు కూరాకుల రాజా, పట్టణ అధ్యక్షుడు రెడ్డి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా
టెన్త్ విద్యార్థినులకు గాయాలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని చింతలూరు పెద్ద చెరువు వద్ద బుధవారం ఆటో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో చింతలూరు గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థినులు భవాని, శిరీష, రజని గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని శాంతిఆశ్రమం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స అందించి ఇంటికి పంపించారు. ఒమ్మంగిలో పదో తరగతి పరీక్షలు రాసి తిరిగి ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

గొరంపేటలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



గొరంపేటలో ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికుడు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని గొరంపేట సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అన్నారు. మండలంలోని గొరంపేటలో బుధవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏసుబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

పక్కాగా ఎన్నికల నియమావళి అమలు



దొండవాకలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీల తొలగింపును పర్యవేక్షిస్తున్న అధికారులు

తుని రూరల్: కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడంతో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ)ని అధికారులు పక్కాగా అమలు చేస్తున్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, స్టిక్కర్లు తొలగిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫ్లెక్సీలను సైతం తొలగిస్తున్నారు. సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు తమ ఇళ్లపై ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలనూ తీసివేస్తున్నారు. ప్రైవేట్ ఆస్తులకు సంబంధించి ఎవరైనా ఫ్లెక్సీలు, బ్యానర్లు, స్టిక్కర్ల ఏర్పాటు చేసుకోవాలంటే తప్పనిసరిగా ఎన్నికల అధికారుల అనుమతి పొందాలని ఎంపీడీఓ, ఎంసీసీ పర్యవేక్షణ అధికారి రవికుమార్ తెలిపారు. బుధవారం ఆయన రేఖవానిపాలెం, దొండవాక, మరువాడ గ్రామాల్లో పర్యటించి ఎంసీసీ నియమావళి ప్రజలకు వివరించారు.

ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం ఖాయం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- వాకపల్లిలో గడప గడపకూ...

ప్రత్తిపాడు రూరల్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని వాకపల్లిలో బుధవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నేత రేఖా శ్రీను ఆధ్వర్యంలో నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ అర్హతే ప్రమాణంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా నవరత్నాలు పథకాలను అమలు చేశారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీకి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

వైఎస్సార్ సీపీలో 70 కుటుంబాలు చేరిక

మండలంలోని వాకపల్లిలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 70 కుటుంబాలు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరాయి. కోడిబోయిన సింహాద్రి యాదవ్, గొర్లు రమణ, సారిపల్లి సూర్యచంద్రం, గండి రామారావు, ముదడ అప్పలకొండ, సీకోలు సహదేవుడు, పేర్ల వెంకటలక్ష్మి తదితరులు వైఎస్సార్ సీపీలో చేరగా వీరికి పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు కండువాలు వేసి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, గొనగాల అప్పలరాజు, అల్లు సత్తిబాబు, ముప్పిడి ఏసుబాబు, శెట్టి సత్తిబాబు, రేఖ సూరిబాబు, రేఖ కృష్ణ, ముదడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వాకపల్లిలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు



భద్రవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వరుపుల సుబ్బారావు

వైఎస్సార్ సీపీకి విశేష ప్రజాదరణ

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీకి అన్నివర్గాల ప్రజల నుంచి మంచి ఆదరణ వస్తోందని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని భద్రవరంలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్ సీపీ విజయాన్ని అపలేరన్నారు. ప్రజల మద్దతు ఉన్న సీఎం జగన్ మళ్లీ గద్దె నెక్కడం ఖాయమన్నారు. తొలుత జగనన్న కాలనీలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అడపా పార్థసారథి, సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు, దుర్గారావు, కాశపు వీరబాబు, కాకర రాంబాబు, ఉగ్గిన రాజు, సామంతుల చిన్నారావు, పసల నాగేశ్వరరావు, ఓలేటి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ



తంటికొండలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

గోకవరం: మండలంలోని తంటికొండలో కోదండ రామాలయం వద్ద ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠాపనలో భాగంగా మూడు రోజుల పాటు వేద పండితుడు ద్విభాష్యం సూర్యవెంకటసుబ్బారావు శర్మ ఆధ్వర్యంలో రుత్విక్కులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. చివరిరోజు బుధవారం ప్రత్యేక పూజలు చేసి ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

తొండంగి: మండలంలోని ఏవీ నగరంలో నూతనంగా నిర్మించిన కృష్ణాలయంలో స్వామివారి విగ్రహాన్ని బుధవారం ప్రతిష్ఠించారు. ఆలయ వ్యవస్థాపకులు కొయ్యా మురళీ కృష్ణ, కొయ్యా శ్రీనుబాబు ఆధ్వర్యంలో పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.

జగన్ పాలనలో అన్ని వర్గాలకూ మేలు

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట అభ్యర్థి తోట నరసింహం తనయుడు రాంజీ
- రంపయర్రంపాలెం ఎన్నికల ప్రచారం



రంపయర్రంపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న తోట రాంజీ

గోకవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకూ మేలు చేకూరిందని వైఎస్సార్ సీపీ జగ్గంపేట అభ్యర్థి, మాజీ ఎంపీ తోట నరసింహం తనయుడు తోట రాంజీ అన్నారు. మండలంలోని రంపయర్రంపాలెంలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ఈ పథకాలన్నీ భవిషత్‌తో అమలు కావాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తన తండ్రి తోట నరసింహాన్ని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, నాయకులు సుంకర వీరబాబు, సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, వరసాల ప్రసాద్, సమ్మెటి నాని, కర్రి శివ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట అభ్యర్థి తోట నరసింహం సతీమణి వాణి
- కిర్లంపూడిలో ఎన్నికల ప్రచారం



కిర్లంపూడిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న తోట వాణి, శ్రీనిధి తదితరులు

కిర్లంపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సతీమణి వాణి అన్నారు. కిర్లంపూడిలో వైఎస్సార్ సీపీ నేత వేగి రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తోట వాణి, ఆమె కోడలు తోట శ్రీనిధి పార్టీ నాయకులతో కలసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని కోరారు. తొలుత మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం స్వగృహానికి వెళ్లి ముద్రగడ సతీమణి పద్మావతి ఆశీసులు తీసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ, పెనగంటి రాజేష్, పాముల చంటి, దాడి చినబుజ్జి, కర్రి వెంకటరమణమూర్తి, మక్కా లక్ష్మీపార్వతి, అడారి మహేష్, దాడి అప్పలరాజు, శరకణం శ్రీను, పీలా లోవసుబ్రహ్మణ్యం, గుబ్బాల కుమారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి తిరునాళ్లు

- వేలాదిగా పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు
- గోవింద నామస్మరణతో మార్మోగిన తాళ్లూరు



గజేంద్ర పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



తిరునాళ్లలో ఏర్పాటు చేసిన దుకాణాలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు గ్రామం బుధవారం జనసంద్రమైంది. గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక తిరునాళ్లు కన్నులపండువగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలోని గజేంద్ర పుష్కరిణిలో వేలాది మంది పుణ్యస్నానాలు ఆచరించారు. తెల్లవారుజాము నుంచే పుణ్యస్నానాలకు భక్తులు పోటెత్తారు. గోవింద నామస్మరణతో ఆలయంలోకి ప్రవేశించి స్వామివారి మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. ఆలయ వంశపార పర్య అర్చకులు పొడుగు ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ కాంతులు భక్తులను ఆకట్టుకున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఎస్సై ఎస్.రామకృష్ణ తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. మొదటిరోజు ఎటువంటి అల్లర్లు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా తిరునాళ్లు జరగడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఊపిరి పీల్చుకున్నారు.

కలుషిత నీటిలోనే పుణ్యస్నానాలు

నిరునాళ్లను పురస్కరించుకుని గజేంద్రమోక్ష పుష్కరిణిలో నీటిని ఆలయ అధికారులు మార్చకపోవడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. నెలల తరబడి ఉన్న కలుషిత నీటిలోనే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. మెట్లపై నాచుకట్టడంతో భక్తులు కాలుజారి కోనేటిలో పడ్డారు. కోనేటిలో నీరు కలుషితం కావడంపై ఆలయ అధికారులను ప్రశ్నించగా ఇక్కడ రైతులు ధాన్యం ఎగరవేడంతో దుమ్ము కోనేరులో పడి నీరు కలుషితమైందన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, యువ నాయకుడు తోట రాంజీ, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు ఒబిణ్ణి వీరబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు స్వామివారిని దర్శించుకున్నారు

గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాల కవాతు



డి.పోలవరంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ మూర్తి

తుని రూరల్: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని, హింసాత్మక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తుని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మూర్తి అన్నారు. ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ఎన్.సూరవరం, సుభద్రయ్యమ్మపేట, డి.పోలవరం, అశోక్‌నగర్ గండి, కేఓ.మల్లవరం, తదితర గ్రామాల్లో బుధవారం కేంద్ర పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. తుని రూరల్ ఎస్సై రమేష్ బాబు ఆధ్వర్యంలో సీఎస్ఎఫ్ జవాన్లు, పోలీసులు గ్రామాల్లో మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మూర్తి మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, ఇతర ప్రోత్సాహకాలు అందించడం, ఓటు వేయడాన్ని అడ్డుకోవడం తదితర అంశాలు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్టే అన్నారు. గ్రామాల్లో, పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తుని రూరల్ పోలీస్‌లు, సీఎస్ఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న ఇద్దరి మహిళల అరెస్టు

ప్రత్తిపాడు రూరల్: సారా విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్టు ప్రత్తిపాడు ఎస్ఈబీ సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ప్రత్తిపాడు ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో బుధవారం అధికారులు దాడులు నిర్వహించారు. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో ఐదు లీటర్ల సారాతో రాళ్ల దుర్గ, కిర్లంపూడి మండలం గోనడలో ఐదు లీటర్ల సారాతో కర్రి శ్రీలక్ష్మిలను అరెస్టు చేశారు. ప్రత్తిపాడు మండలం వేములపాలెంలో 1600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ వివరించారు. ఈ ఘటనలో అదే గ్రామానికి చెందిన తుట్టా అప్పలరాజు పరారీ కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్సై ఎం.ఆశాలత, హెడ్ కానిస్టేబుల్స్ వెంకన్న దొర, కృష్ణార్జునరావు, కానిస్టేబుళ్లు దొరబాబు, రాజు, రాంబాబు, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరికి జరిమానా

గోకవరం: వ్యక్తిపై దాడి చేసిన కేసులో ఇద్దరికి న్యాయస్థానం జరిమానా విధించినట్టు గోకవరం ఎస్సై కె.నాగరాజు బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని కామరాజుపేటకు చెందిన పల్లేటి రాంబాబు, పల్లేటి వెంకన్న అదే గ్రామానికి చెందిన బత్తిన రమేష్‌పై 2020 అక్టోబర్ నెలలో దాడి చేసి గాయపరిచారు. దీనిపై బాధితుడి భార్య మణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. రాజమహేంద్రవరంలోని మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో వాదనలు జరిగాయి. ముద్దాయిలపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి రూ.5 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి జగదీశ్వరి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ మహాలక్ష్మి వాదనలు వినిపించారు.

నమూనాలయంలో విగ్రహాల తయారీకి రూ.లక్ష విరాళం



విరాళం డీడీని ఈఓ రామచంద్రమోహన్‌కు అందచేస్తున్న సుమలత, ఉదయ్‌శంకర్

అన్నవరం: స్థానిక జాతీయ రహదారిపై రూ.నాలుగు కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సత్యదేవుని నమూనా ఆలయంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవార్ల గ్రానైట్ శిలా విగ్రహాలను తయారు చేయించేందుకు గాను కాకినాడకు చెందిన జేఎన్‌టీయూ ప్రొఫెసర్ లింగంగుంట సుమలత, నిడగట్ల ఉదయశంకర్ రూ.లక్ష విరాళాన్ని సమర్పించారు. ఈ మేరకు దేవస్థానం ఈఓ కే రామచంద్రమోహన్‌కు బ్యాంకు డీడీ అందజేశారని అధికారులు తెలిపారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో వేంచేసిన రామలింగేశ్వరస్వామికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అకాల వర్షంతో అవస్థలు

- నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు
- రోడ్లపై ప్రవహించిన నీరు



జగ్గంపేటలో రహదారిపై ప్రవహిస్తున్న వర్షం, మురుగు నీరు

జగ్గంపేట: అల్పపీడన ప్రభావంతో తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. అకాల వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జగ్గంపేటలో రహదారులపై నీరు ఏరులై పారింది. స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో భారీగా వరదనీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బస్టాండ్‌లోని ఆర్టీసీ పార్శిల్ సర్వీస్ ఆఫీసు వద్ద మోటారు సైకిళ్లు నీట మునిగాయి. హైవే బ్రిడ్జి పక్కన తహసీల్దార్ ఆఫీస్ వద్ద రహదారిపై మోకాలు ఎత్తున వర్షపు, మురికి నీరు ప్రవహించింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జగ్గంపేట మెయిన్‌రోడ్డుపై భారీగా సైతం నీరు ప్రవహించింది. జగ్గంపేటలో హైవేపై బ్రిడ్జి పక్కన డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో వర్షం పడితే మురుగు, వర్షపు నీరు నిలిచిపోతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వర్షంతో ఉపశమనం

తుని: వారం రోజులుగా ఎండల తీవ్రతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు బుధవారం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. సాయంత్రం తుని పట్టణంలో ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈదురు గాలులకు విద్యుత్ లైన్లు తెలగిపోవడంతో సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన సమస్యను పరిష్కరించి సరఫరాను పునరుద్ధరించారు. ఉద్యాన పంటలకు ఈ వర్షం మేలు చేస్తోందని అధికారులు తెలిపారు.

హోరు వాన

తుని రూరల్: మండల వ్యాప్తంగా బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంది. సాయంత్రం మండలంలోని కేఓ మల్లవరం, టి.తిమ్మాపురం, తేటగుంట, హంసవరం, తేటగుంట తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు గ్రామాల్లో కోతలు కోసి పనలపై ఉన్న అపరాల పంటలు వర్షానికి తడిసిపోయాయి. కాగా ఈ వర్షం కూరగాయలు పంటలకు మేలు చేస్తుందని హెచ్ఓ జి.విజయలక్ష్మి తెలిపారు.

పిడుగుపాటుకు వరికుప్ప దగ్ధం



కోటనందూరులో పిడుగుపాటుకు కాలిపోతున్న వరికుప్ప

కోటనందూరు: గ్రామంలో బుధవారం పిడుగుపాటుకు వరికుప్ప దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే... స్థానిక రైతు గొంప చినగజ్జియ్య రెండెకరాల్లో పండించిన వరి పంటను తన పొలంలో కుప్పవేశాడు. అల్పపీడనం ప్రభావంతో బుధవారం సాయంత్రం పిడుగు పడటంతో వరికుప్ప పూర్తిగా కాలి బూడిదైంది. ఆరుగాలం శ్రమించి వ్యయప్రయాసల కోర్చి పండించిన పంట నాశనమవడంతో బాధిత రైతు ఆందోళన వ్యక్తం చేశాడు. వీఆర్వోలు శివరామకృష్ణ, భవానీ సంఘటన స్థలాన్ని సందర్శించి రూ.లక్ష వరకూ నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.

భారీ వర్షం

గండేపల్లి: మండల వ్యాప్తంగా బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. అకాల వర్షానికి రైతులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి గుబురు ఎండ కాయడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఈదురు గాలులతో వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు ఏకధాటిగా వడగండ్ల వాన కురిసంది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. కొన్ని గ్రామాల్లో కోసి పనలపై ఉన్న వరి పంట తడిసిపోయింది.

కిర్లంపూడి: మండల వ్యాప్తంగా బుధవారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. ఈ వర్షం పంటలపై స్వల్ప ప్రభావం చూపడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మండలంలో వరి పంట 10 వేల ఎకరాలు, మొక్కజొన్న 300 ఎకరాలు, చెరకు 800 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు.